క్లుప్తంగా

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

మంగళగిరి: కృష్ణాజలాల పంపిణీపై కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ ఏపీ వ్యవసాయ రంగాన్ని నాశనం చేసేవిధంగా ఉందని, వెంటనే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య డిమాండ్ చేశారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు పరిస్థితులకు తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20,21 తేదీల్లో విజయవాడలో 30 గంటల నిరసన దీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. సీపీఐ నాయకులు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, టి.వెంకటయ్య, జె.సాంబశివరావు, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సినీ హీరో కృష్ణకు ఘననివాళి



తాడేపల్లిరూరల్: సూపర్‌స్టార్ కృష్ణ ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని దుగ్గిరాలలోని ముర్తుజా నగర్‌లో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు చలనచిత్ర పరిశ్రమలో సూపర్‌స్టార్ కృష్ణది ఒక ప్రత్యేకమైన స్థానమని, ఆయన పలు రికార్డులను సొంతం చేసుకున్నారని అన్నారు. తెలుగులో తొలి జేమ్స్‌బాండ్ సినిమా, ఆయనే చేశారని, ఆయన నటించిన చిత్రాలు వినోదం కోసం మాత్రమే కాకుండా సందేశాత్మకంగా ఉండేవని అన్నారు. పార్లమెంట్ సభ్యుడిగా ప్రజాసేవ చేశారని కొనియాడారు. సయ్యద్ జానీ, పఠాన్ మస్తాన్ వలి, షేక్ ఖాదర్, షేక్ బాజీ, మున్నంగి శ్రీను, కాక వెంకటేశ్వర్లు, బొద్దులూరి వెంకటేశ్వరరావు, బులుసుపాటి యల్లేశ్వరరావు, మునిపల్లి కుమార్, దేవర నాయుడు, వీరంకి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఫిరంగిపురం : మండలకేంద్రంలోని గాలిబాలి శాఖ గ్రంథాలయంలో బుధవారం 56వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో సెయింట్ ఆన్స్ పాఠశాల, అల్లంవారిపాలెం జెడ్పీ పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాలను గ్రంథాలయ ఇన్‌చార్జి పి.జేమ్స్, డి.కృష్ణమూర్తిలు పర్యవేక్షించారు.

తాగునీటి వసతికి రూ.55వేల విరాళం

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధి నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల తాగునీటి వసతికి ఎన్‌ఆర్ఐ కొండా చంద్రశేఖరరెడ్డి రూ.55వేల విరాళాన్ని అందజేసినట్లు బి.రాజీవ్‌రత్న తెలిపారు. రూరల్ హోప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కొండా చంద్రశేఖరరెడ్డి గత కొన్నేళ్ల క్రితం ఇదే పాఠశాలలో విద్యను అభ్యసించి తాను చదువుకున్న పాఠశాలకు ఏదైనా చేయాలనే సంకల్పంతో బోరు పంపు, ట్యాపుల నిర్మాణం నిమిత్తం విరాళాన్ని అందజేశారని తెలిపారు. దాత అందజేసిన విరాళంతో పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బోరు పంపును, ట్యాపులను బుధవారం ఆయన సోదరుడు మహేశ్వరరెడ్డి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు శివారెడ్డి, ప్రసాదరెడ్డి, బ్రహ్మరెడ్డి, శివరామిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ రజనీ నాయక్‌లతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని నవులూరు, బాబూజీనగర్, దళిత శిబిరం ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మార్పు నిమిత్తం గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

మాదక ద్రవ్యాల వినియోగాన్ని నివారించాలి

మంగళగిరి: సామాజిక బాధ్యతతో మాదక ద్రవ్యాల వినియోగాన్ని నివారించాలని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు అన్నారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో నగరంలోని పార్క్‌రోడ్ హోలీ లార్డ్ పెంతెకొస్తు చర్చి ప్రాంగణంలో బుధవారం మాదక ద్రవ్యాలు – సోషల్ మీడియా దుర్వినియోగంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిత్య జీవితంలో ఎంతో మంది విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిసలై పోతున్నారని, మత్తు పదార్థాలు విద్యార్థుల జీవితాన్ని నాశనం చేస్తాయనే విషయాన్ని గుర్తెరగాలని సూచించారు. నవజీవన్ బాల భవన్ జోనల్ కో–ఆర్డినేటర్ ప్రియాంక, ప్రతినిధి బి.రమేష్ పాల్గొన్నారు.

అన్నివర్గాలకు సమన్యాయం

- హామీలన్నీ నూరుశాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దే
- లాంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో కత్తెర సురేష్ కుమార్



లాంలో జగనన్న ప్రగతి పథం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కత్తెర సురేష్ కుమార్



పథకాల వివరాలు తెలిపే బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు కత్తిరేణమ్మ, మార్పుల శివరామిరెడ్డి



యర్రబాలెంలో సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును ఆవిష్కరిస్తున్న ఈఓపీఆర్డీ శ్రీనివాసరెడ్డి

లాం(తాడికొండ): రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సమన్యాయం చేయాలన్నదే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా తాడికొండ మండలం లాం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన సచివాలయంలో సంక్షేమ పథకాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద వర్గాలకు రాష్ట్రంలో సమప్రాధాన్యత కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయంగా, సామాజికంగా, వారిని బలోపేతం చేసేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పార్టీ పదవులు, నామినేటెడ్ పదవుల్లో కీలకమైన అధికారాలు కట్టబెట్టి సామాజిక న్యాయం పాటిస్తున్నారన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా ఎన్నికల్లో ఓట్లేసిన వారికే న్యాయం చేస్తానని చెప్పకుండా ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరులకు ఉన్న హక్కులను కాపాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు ఇంటింటికీ అందిస్తున్నారన్నారు. పేద ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి పేదవాడికి భద్రత కల్పించేందుకు రాష్ట్రంలో 75 సంవత్సరాల దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు, అందులో పక్కా ఇళ్ల నిర్మాణం చేయిస్తున్నారని గుర్తు చేశారు. 14 సంవత్సరాలు అధికారంలో ఉన్న బాబు పేదల కోసం ఒక్క సంక్షేమ పథకమైనా అమలు చేసినట్లు మచ్చుకైనా ఉందేమో ఓ సారి ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా లాం శివారు తాతిరెడ్డిపాలెం గ్రామంలో తాగునీటి సమస్య తొలగించేందుకు ఏర్పాటు చేసిన మూడు బోరు పంపులను ప్రారంభించారు. అనంతరం ప్రగతి పథం ర్యాలీ పోస్టర్లు ఆవిష్కరించిన ఆయన ఈ నెల 18న విజయవాడలో జరగనున్న ప్రగతి పథం ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వర రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్ళ శ్రీనివాసరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడు మాదాసు కిరణ్, స్థానిక నాయకులు షేక్ మీర్జావలి, రావూరి నరేష్, ఫ్రాన్సిస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదపరిమిలో ..

తుళ్ళూరు మండలం పెదపరిమి గ్రామంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కొప్పుల శేషగిరిరావు సచివాలయంలో సంక్షేమ పథకాల పోస్టరును ఆవిష్కరించారు. సొసైటీ అధ్యక్షుడు మున్నంగి కోటిరెడ్డి, నంబూరు రఘునాథరావు, అక్కల లక్ష్మీనారాయణ రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఫిరంగిపురం: రైతులకు ఈ–పంట నమోదు చేసి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించిన ఘనత వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుందని జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. మండలంలోని రేపూడి గ్రామంలోని సచివాలయం వద్ద బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాభివృద్ధి కోసం అందిన నిధులు, పలు పథకాల ద్వారా లబ్ధిదారులకు ఎన్ని పథకాలు అందాయో తెలియజేసే బోర్డును జెడ్పీటీసీ సభ్యురాలు కత్తిరేణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డిలు ఆవిష్కరించారు. కత్తి రేణమ్మ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందాయని చెప్పారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలకు నూతన భవనాలు నాడు–నేడు నిధులతో నిర్మించారని తెలిపారు. మార్పుల శివరామిరెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అందేలా కృషిచేశారన్నారు. సర్పంచ్ చిట్టా అంజనీదేవి, చిట్టా అంజిరెడ్డి, పి.జేమ్స్ ఇన్నయ్య, జి.చంద్రం, డి.మెల్కియా, పాలపాటి రఘు, సంగీతరావు, పి.చిన్న, డి.నరేంద్రకుమార్, శంకరరెడ్డి, సూపరింటెండెంట్ రవిబాబు, కార్యదర్శి గజేంద్ర, కోటేశ్వరరావు నాయక్, వెంకటేష్, ఎస్.చిన్నప్ప, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

యర్రబాలెంలో...

మంగళగిరి: మంగళగిరి – తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని, ఎవరికైనా అర్హత ఉండీ సంక్షేమ పథకాలు నేటికీ అందనట్లయితే దరఖాస్తులు చేసుకోవాలని నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం ఒకటవ సచివాలయం ఆవరణలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఈఓఆర్‌డీ శ్రీనివాసరెడ్డిలు హాజరై దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సచివాలయ పరిధిలో అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధికి సంబంధించిన ప్రచారబోర్డును స్థానిక పార్టీ నాయకులతో కలసి ఆవిష్కరించారు. లక్ష్మీపతిరావు మాట్లాడుతూ యర్రబాలెం ఒకటో సచివాలయ పరిధిలో గత నాలుగున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు రూ.33.77కోట్లు కేటాయించినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఎం.కోటిరెడ్డి, సచివాలయ అధికారులు విజయ్, రహీమ్, జగన్ మోహన్‌రావు, వైఎస్సార్ సీపీ నాయకులు గుండాల శ్రీనివాసరావు, రేమిణిశెట్టి గోపి పాల్గొన్నారు.

సిరిపురంలో...

మేడికొండూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మేడికొండూరు ఎంపీపీ మన్నవ స్వప్న రాజేష్ అన్నారు. మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో బుధవారం జరిగిన 'ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో 90 శాతం మంది ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాయన్నారు. ప్రతి సచివాలయాలనికి రూ. కోట్లు నిధులు విడుదల చేసి సంక్షేమం అందిస్తున్నారన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో వై.ఎస్.జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తాళ్లూరి వంశీకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ అబ్బాస్, జోసఫ్‌రెడ్డి, ఈఓపీఆర్డీ రవికుమార్, పంచాయతీ సెక్రటరీ టి.వెంకటేశ్వర్లు, గ్రామ అధ్యక్షుడు శౌరిరెడ్డి, రన్ హుస్సేన్ పాల్గొన్నారు.

దాతల సహకారంతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)
- ఎమ్మెల్సీ మురుగుడుతో కలసి అన్నదాన సత్ర నిర్మాణ పనుల పరిశీలన



అన్నదాన సత్రం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: మంగళగిరి నగరంలో వేంచేసియున్న లక్ష్మీ నృసింహస్వామి వారిని దర్శించుకునేందుకు దేశవ్యాప్తంగా తరలివచ్చే భక్తులకు దాతల సహకారంలో మెరుగైన వసతి సౌకర్యాలను కల్పించడం జరుగుతుందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. బుధవారం ఆయన ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి నగరంలోని శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం సమీపంలోని ఖాళీ స్థలంలో దాతల సహకారంతో నిర్మిస్తున్న అన్నదాన సత్రం నిర్మాణ పనులను పరిశీలించి దేవస్థాన అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ దేవస్థానం వద్ద ఉన్న భవనం ఇప్పటికే భక్తుల అన్నదాన కార్యక్రమానికి సరిపోకపోవడంతో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశ్యంతో దాతల సహాయంతో నూతన అన్నదాన సత్రాన్ని నిర్మించడం జరుగుతుందన్నారు. విజయవాడకు చెందిన విజయ్ అనే దాత సుమారు రూ. 20 లక్షల వరకు నిర్మాణ పనులకు నిధులను ఇవ్వగా నగరానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు దేవతి భగవన్నారాయణ సుమారు రూ. 80 లక్షలు వెరసి రూ. కోటితో అన్నదాన సత్ర నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఈ అన్నదాన సత్రశాలలో ప్రతి రోజూ 200 నుంచి 300 మంది భక్తులు అన్నప్రసాదాన్ని తినే విధంగా నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఈ ఏడాది డిసెంబరు 23వ తేదీన ముక్కోటి ఏకాదశి నాటికి అన్నదాన సత్రాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకు రావడం జరుగుతుందన్నారు. దేవస్థాన ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, సత్రశాల నిర్మాణ దాత దేవతి భగవన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల పరిశీలన ...

కార్పొరేషన్ పరిధిలోని బేతపూడి బాబూజీనగర్‌లో తుదిదశకు చేరుకున్న డాక్టర్ బాబూ జగ్జీవనరామ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే ఆర్కే నగరపాలక సంస్థ కమిషనర్ నిర్మల్ కుమార్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ సుమారు రూ.1.50 కోట్ల నిధులతో బాబూ జగ్జీవనరామ్ కమ్యూనిటీ హాల్‌ను నిర్మించడం జరుగుతుందన్నారు. ఈనెల 25వ తేదీ నాటికి ప్రారంభోత్సవం చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, వైఎస్సార్ సీపీ నాయకులు శేషిరెడ్డి, బేతపూడి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల ఎంపీడీఓకు ఘన సత్కారం..

తాడేపల్లిరూరల్: ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు సేవచేయడంలో ముందుంటారని మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం దుగ్గిరాల మండల ప్రజాపరిషత్ అధికారిణి కుసుమ శ్రీదేవి వీడ్కోలు సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం సాధించడం సమాజంలోని పేద వర్గాలకు సహాయ పడడానికి కీలకమైన బాధ్యత అని అన్నారు. ప్రభుత్వాలు అమలు పరుస్తున్న ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని ప్రజలకు చేరవేసే బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులపై ఉంటుందని అన్నారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారిణిగా పదోన్నతి పొందిన దుగ్గిరాల మండల ప్రజాపరిషత్ అధికారిణి శ్రీమతి కుసుమ శ్రీదేవిని సత్కరించారు. దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరి పైరు పరిశీలించిన అధికారులు



రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్త సాయిశివరావు, డీపీఓ రామాంజనేయులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో వరి పంట పొలాలను బాపట్ల వరి పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త సాయిశివరావు, డీపీఓ రామాంజనేయులు, దుగ్గిరాల వ్యవసాయ అధికారి పి.శిరీష, తెనాలి సబ్ డివిజన్ అగ్రికల్చర్ అధికారి శ్రీమతి ఉషారాణిలు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెనుమూలి, కంఠంరాజు కొండూరు గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించామని, అక్కడక్కడ అగ్గి తెగులును గమనించామని, అగ్గితెగులు ఉన్న పొలాల్లో బీమ్ 120 గ్రాములు ఎకరాకు పిచికారీ చేయాలని, 10 రోజులకు కాసుగామైసిన్ లేదా ఐసోప్రోథిలేన్ 400 గ్రాములు ఎకరాకు పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించామని తెలిపారు. దుబ్బుకు 15 దోమల వరకు ఉంటే పంటకు ఎటువంటి నష్టం ఉండదని, పురుగుమందులు అధికంగా వాడడం కారణంగా పంటకు మేలు చేసే మిత్ర పురుగులు కూడా నశిస్తాయని రైతులకు వివరించామని తెలిపారు. వరిపొలంలో పొటాషియం వాడకం వలన గింజ నాణ్యత, బరువు బాగుంటుందని సూచించామని తెలిపారు. అనంతరం కంఠంరాజు కొండూరు గ్రామంలో రైతులకు వరిపంటపై సమగ్ర యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చామని తెలిపారు. రైతులు, గ్రామ వ్యవసాయ అధికారిణి ఇందిర, ఏఈఓ రమేష్ పాల్గొన్నారు.

పూర్వ వేద విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న వేద విద్యార్థులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై నిర్వహిస్తున్న 67వ తిరునక్షత్ర వేడుకల్లో భాగంగా బుధవారం పూర్వ వేద విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ తిరునక్షత్ర వేడుకల్లో భాగంగా ఉదయం శ్రీ చిన్న జీయర్‌స్వామి హస్తాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించామని, అనంతరం తీర్థప్రసాద గోష్ఠి జరిగిందని తెలిపారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆశ్రమంలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల సమావేశంలో పాల్గొన్న వారు తమ చిన్ననాటి విశేషాలను, స్వామి వారితో తమకున్న అనుబంధాన్ని పంచుకున్నారని తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞాన సముపార్జన

పౌర గ్రంథాలయ సంచాలకులు ఎంఆర్ ప్రసన్నకుమార్



అయ్యంకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఆర్ ప్రసన్నకుమార్, సీహెచ్ దీక్షితులు

మంగళగిరి: పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని, జ్ఞాన సముపార్జనకు పుస్తకాలు ఎంతో దోహదపడతాయని పౌర గ్రంథాలయ సంచాలకులు ఎంఆర్ ప్రసన్నకుమార్ అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం నగరంలోని శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పౌర గ్రంథాలయ సంచాలకులు ఎంఆర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పుస్తకం సమాజాన్ని మార్చుతుందని, పుస్తకాలు చదవడం వల్లే ఎందరో గొప్పవారు అయ్యారని గుర్తుచేశారు. చిన్నతనం నుంచే పిల్లలు పుస్తకాలు చదివేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. పౌర గ్రంథాలయ సహాయ సంచాలకులు సీహెచ్ దీక్షితులు, ఆర్ఓపీ కె.నాగరాజు, టీచర్లు నాగకుమారి, నసీమా, సుమతిలతో పాటు పలువురు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతక్కిలో...

56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కార్పొరేషన్ పరిధి నూతక్కి శాఖా గ్రంథాలయంలో బుధవారం పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి వీవీ సత్యనారాయణ పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ప్రారంభించారు. జొన్నల బ్రహ్మానందరెడ్డి, జొన్నల శివరామిరెడ్డి, గ్రంథాలయ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకర్షించిన పుస్తక ప్రదర్శన..

తాడేపల్లిరూరల్: 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి శాఖా గ్రంథాలయంలో బుధవారం పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి షేక్ నాగుర్ బాషా మాట్లాడుతూ తాడేపల్లి హైస్కూల్, ఎలిమెంటరీ స్కూల్, తదితర పాఠశాలల విద్యార్థులు పుస్తక ప్రదర్శనలో పాల్గొన్నారని అన్నారు. సబ్‌జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగంలో పర్యావరణం పరిరక్షణ అనే అంశంపై చిత్రలేఖ పోటీలు నిర్వహించామని ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఉమామహేశ్వరరెడ్డి, సీహెచ్ రమేష్, శ్రీమతి డి. జోత్స్నకుమారిలు వ్యవహించారని అన్నారు.

తుళ్లూరులో...



తాడికొండ: పుస్తక పఠనం ద్వారానే విజ్ఞాన సముపార్జన పెంపొందించుకోవచ్చని తుళ్ళూరు గ్రంథాలయాధికారి టి.గిరిధర్ కుమార్ అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా తుళ్ళూరు గ్రంథాలయంలో పుస్తక పఠనంపై విద్యార్థులకు వివరించారు, అనంతరం డ్రగ్స్ వలన కలిగే అనర్థాలపై వివరించారు. అనంతరం సమాజంలో గ్రంథాలయాల పాత్ర అనే అంశంపై వ్యాసరచనా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. తాడికొండ గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసి చిన్నారులకు అవగాహన కల్పించారు.

వెయిట్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మంగళగిరి లిఫ్టర్ల ప్రతిభ



పతకాలు సాధించిన లిఫ్టర్లతో కోచ్ ఎస్‌కే సంధాని

మంగళగిరి: ఉమ్మడి కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నం జాకీర్ హుస్సేన్ కళాశాల ఆవరణలో ఈనెల 13,14 తేదీల్లో జరిగిన కృష్ణ యూనివర్సిటీ అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్ పోటీల్లో మంగళగిరి ఫిట్‌జోన్ జిమ్‌లో శిక్షణ పొందుతున్న లిఫ్టర్లు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించినట్లు కోచ్ షేక్ సంధాని తెలిపారు. బుధవారం నగరంలోని ఫిట్‌జోన్ ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన వివరాలను వెల్లడించారు. విజయవాడ కేబీఎన్ కళాశాల విద్యార్థి భరత్‌కుమార్ 56 కేజీల విభాగంలో స్క్వాడ్ 215 కిలోలు, బెంచి ప్రెస్ 127 కిలోలు, డెడ్‌లిఫ్ట్ 250 కిలోలు వెరసి మొత్తం 562 కిలోల బరువునెత్తి స్వర్ణపతకం సాధించినట్లు తెలిపారు. విజయవాడ లయోలా కళాశాల విద్యార్థి జి.శివ వీరయ్య 66 కేజీల విభాగంలో స్క్వాడ్ 180 కిలోలు, బెంచిప్రెస్ 82 కిలోలు, డెడ్‌లిఫ్ట్ 190 కేజీలు వెరసి మొత్తం 452 కిలోల బరువునెత్తి స్వర్ణపతకం సాధించినట్లు తెలిపారు. విజయవాడ వెస్టన్ కళాశాల విద్యార్థి జి.నాగేంద్రబాబు 74 కేజీల విభాగంలో స్క్వాడ్ 195 కిలోలు, బెంచ్‌ప్రెస్ 72 కిలోలు, డెడ్‌లిఫ్ట్ 210 కిలోలు వెరసి 477 కిలోల బరువునెత్తి రజతపతకం సాధించినట్లు తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబర్చి పతకాలు సాధించిన క్రీడాకారులను నేషనల్ వెయిట్ లిఫ్టర్ కొమ్మకుల విజయభాస్కరరావు, నేషనల్ పవర్ లిఫ్టర్ బి. ప్రసాద్, సీనియర్ పవర్ లిఫ్టర్ గుమ్మడి వెంకటేశ్వరరావులతో పాటు పలువురు నగర ప్రముఖులు అభినందించినట్లు కోచ్ సంధాని తెలిపారు.

పంటపొలాల్లో చెలరేగుతున్న దొంగలు



పంట పొలాల్లో మీటర్ల వద్ద కత్తిరించిన వైర్లు



మోటార్ల వద్ద కత్తిరించి పక్కన పడేసిన బోరు ట్యాప్

రాత్రిళ్లు మోటారు కరెంటు వైర్లు దొంగిలించి, కాల్చి రాగి చోరీ చేస్తున్న వైనం

కంతేరు(తాడికొండ): తాడికొండ మండలం కంతేరు గ్రామ పంట పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద వైర్ల దొంగలు హల్‌చల్ చేస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాల్లో ఉన్న బోర్ల వద్దకు అర్ధరాత్రి సమయంలో వెళ్లి వైర్లను చాకచక్యంగా తొలగించి, కాల్చి, అందులో ఉన్న కాపర్‌ను తస్కరించి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. గత కొన్ని నెలలుగా ఈ తంతు జరుగుతున్నా నిందితులపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేకపోవడంతో గత మూడు రోజుల వ్యవధిలో మళ్లీ మూడు బోర్ల వైర్లు కత్తిరించుకొని వెళ్లారు. దీంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. తస్కరించినప్పుడల్లా వైర్లు కొనుగోలు చేసి వేసేందుకు రూ.10 వేలు అదనంగా ఖర్చవుతుందని, ఒక్కో రైతు పొలంలో 2–3 సార్లు ఇప్పటికే కత్తిరించుకెళ్లిన సందర్భాలు ఉండటంతో తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని ఇకనైనా దృష్టి సారించి నిందితులెవరో గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుపై పరిశీలన

తెనాలి: పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అడుగులు పడుతున్నాయి. ఆయా ప్రదేశాల్లో సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుపై బుధవారం మున్సిపల్ ఇన్‌ఛార్జి చైర్‌పర్సన్ మాలేపాటి హరిప్రసాద్ సాంకేతిక నిపుణులు, పోలీసు అధికారులతో కలిసి ఆయా పాయింట్లను పరిశీలించారు. ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.